భ్రాంతి

శ్రీ జో. రమాకాంత్

'కాన్వకేషన్' వట్టి పనికి మాలిన లాంఛనమని, మూర్తి తీవ్రముగా వాదించువాడు. తన బి.ఏ. డిగ్రీ పంతమునకు 'పోష్టు' ద్వారా తెప్పించుకొనెను. ఈ సారి వెడలినచో స్నేహితు లెగతాళి చేయుదురేమోనని కూడ స్ఫురించలేదు. ఎందుకు స్ఫురించును? తానేమియును మారలేదు. 'కాన్వకేషన్' ఒక సాకు మాత్రమే...తన ప్రయాణము తనకే హాస్యాస్పదముగా నుండెను.

మృదంగ నినాదముతో రైలు సాగిపోవుచుండెను. ఆ పెట్టెలో యితరు లెవ్వరును లేరు. అది యాషాఢమాసము. శుక్లపక్షము. ఆకాశము మేఘావృతమై యుండెను. అప్పుడప్పుడు సన్నని తుప్పర పడుచుండెను. నీటి తెరలవెనుక ప్రకృతి నగ్న సౌందర్యము మిక్కిలి ముచ్చటగ నుండెను. ఆ వాయువుల వెల్లి మైకములో లీనమై యాతడు ప్రస్తుతమును మఱచి పూర్వమును తలచుకొనుచుండెను...

అతనికి చిన్ననాటి నుండియు స్నేహితులు తక్కువ. నిత్యము సముద్రమున కేగెడి వాడు. దూరమున నున్న గుట్టలలో నొక బండపై గూర్చుని యేవేవో, యెన్నెన్నో ఆలోచించెడివాడు. వానిలో చాలభాగము లోకము కసితీరా నిర్మూలించెను. మిగిలిన వాటిని జీవితము బలికోరెను .. ఆ ప్రాంతములకే కమల కూడ వచ్చెడిది. ఇసుక తిన్నెలపై యొంటరిగ గూర్చొని యేదో దీర్ఘముగ యోచించుచుండెడిది. మొదటిలో నటువైపు తిరుగుటకే బిడియపడువాడు. ఆవిడకూడ చూడనట్లు ప్రవర్తించెడిది. త్వరలోనే లజ్జ పోయెను. అప్పుడప్పుడామె రానిచో కొఱతగానుండెడిది. కాని యా కొఱత యెటువంటిదోనని తర్కించలేదు...ఒకనాడు ఆమె అకారణముగ, హఠాత్తుగ, చిలిపిగ నవ్వెను. నరములన్నియును సర్దుకొనుటకు గాబోలు, యొడలంతయు విఱచుకొనెను. చెరగని పాపటను సవరించెను సరిగానున్న పైటనే సర్దెను. మూర్తి యొడలు జలదరించెను. మనస్సనేక వికారములు చెందెను అంతులేని యాలోచన లెన్నియో చెలరేగెను.

"పురుషుడు స్త్రీని చూచిన వెంటనే పొందు అసంపూర్ణ భావ రాగానుభూతియే ప్రేమయనియు, యయ్యది క్షణికమైనను పరిపక్వము నొందజాలకపోయినను, జంతు ధర్మము నతిక్రమించు నొక మనోభావమని జ్యూలె రోమె (*Jules Romain*) నిర్వచించెను. ఈ భావము పురుషునకు ప్రతి స్త్రీయందును జనించదు. నాగరికురాలైన యందకత్తెను చూచినచో కలుగవచ్చును. మూర్తి కమలను నిత్యము చూచుటలో చూడ ముచ్చటపడుటలో నాశ్చర్యము లేదు కమల నాతడు ప్రేమించెనా? దానికి సమాధానము లేదు. ఆమె యెవరో తెలిసికొన యత్నించెను. అవివాహితయో, వితంతువో గావలెనని యూహించెను. కాని యనుభవము లేకనో, ధైర్యము జాలకనో, సిగ్గువల్లనో యామెను పలుకరించ లేదు. ఆమెను వాంఛించెనా? ఔననుటకు వీలులేదు కాదనుట సత్యముకాదు. మరి యిపుడు వికారమేల చెందవలెను? సాధారణముగా నొక వ్యక్తిని చూచినపుడు, యాతని వేషభాషలను బట్టియో, యాతని ప్రవర్తన, పరపతి, గౌరవము, తదితరలక్షణములనుబట్టియో, స్థూలముగ నిట్టివాడనుకొందుము. కొన్ని గుణములను కల్పింతుము. వాని సత్యాసత్యములతో నిమిత్తము లేదు. భావనాప్రపంచమున నొక మూర్తిని సృష్టింతుము. అతడు యీమూర్తి కెంత భిన్నముగ ప్రవర్తించినను, పోలికలనుజూచి మురియుదుము గాని సామాన్యముగ తొలిభావమును సంస్కరింప సాహసింపము. ఇది మానవప్రకృతి. కాదు వికృతి. ఈ భిన్నత్వమే మూర్తికి హఠాత్తుగ గోచరించెను. కాని నమ్మలేదు. సత్యమును నమ్ముట యంత సులభముగాదు. దాని కనుభవ ముండవలెను. అతనికి సంశయముమాత్రము పొడసూపెను. దిగ్భ్రాంతి నొందెను. ఆమెను మఱల చూడనెంచెను.

సంధ్యచీకట్లు క్రమ్ముచుండెను. ఆమె చిరునవ్వు నవ్వుచున్నట్లు మాచాయగ నగుపించెను.. కాదు కాదు. ఇదియంతయు తన భ్రాంతియే! ఏదియో కీటకము ఆమె తలపై బడవచ్చును. వీపుమీదికి దూకవచ్చును. పయ్యెదపై వ్రాలవచ్చును. దానికామె నవ్వ వచ్చును... కాదు. ఆమె తొలుతనే నవ్వెను... ఆమెదెసలు నవ్వుముఖము...చీకట్లు ముదిరెను. కాని మనశ్శాంతి కుదురలేదు. ఆమెవద్దకుబోయి పరీక్షింపవలెనని బయనమయ్యెను. కమల యచ్చటలేదు.

ఆనాటిరాత్రి యాతడొకచిత్రమైన కలగనెను. అదొకయడవి. గాలివాన. అక్కడక్కడ చెట్లనీడను కొందరు తలదాచుకొనుచుండిరి. ఆతడు ఒంటరిగ సాగిపోవుచుండెను. బాటయంతయును నీటితోడను విరిగిపడిపోయిన చెట్లతోడను నానాభీభత్సముగ నుండెను. ఇంతలో పిడుగుపడెను; ఒకచెట్టు దానియందున్న వారిమీదకి కూలెను. తప్పించుకు బయటబడగల్గిన దొక్క స్త్రీమాత్రమే! సహాయార్థ మామె కడకు పరువెత్తెను. పరీక్షించిచూడ నామె కమల! వెంటనే చేతులలోనికి తీసికొనెను. ఆమె కర్తృపట్టను గాబోలు, చిరునవ్వు నవ్వెను. మరుక్షణ మేమి తోచెనో యేమో, చేతులు వదల్చుకొని యడవిలోని కదృశ్యయయ్యెను. 'కమలా' యని యులికిబడి మేల్కాంచెను . ఆరాత్రియంతయును కలతనిదురే.

మరునాడు యథాప్రకారము సముద్రతీరమున కరిగెను. సూర్యాస్తమయముసరికి కమలకూడ వచ్చెను. చిరునవ్వు నవ్వుచు యాతనివద్దనున్న వేరొకబండపై జతికిలబడెను. ఆతనికి ముచ్చెమటలు క్రమ్మెను. ఏవగించుకొనెను. ఒక వస్తువును కాంక్షింతుము. దానిని పొందుటకు ప్రయత్నించెదము. విచారించెదము. బాధపడుదుము. తుదకు సాధించినపుడు ఆనందింతుము. అయ్యది యప్రయత్నముగ లభించినచో నిరసింతుము. అంత సులభసాధ్యముగుదాని నాశించినందుకు సిగ్గుపడుదుము. మూర్తి యామె స్నేహము వాంఛించెను. కాని తనకు తానై వచ్చినపుడు జుగుప్సాభావము కలిగెను. ఆ భావ మామెయందు కలిగెనో లేక తన యూహాప్రపంచపు కమలకును, యీమెకును గల ప్రస్ఫుటభేదమును గుర్తించుటవలన కలిగెనో యనిశ్చితము ... ఆమె చిరునవ్వు నవ్వుచుండెను. ఏమనుటకును నోరాడలేదు. ఏమిచేయుటకును తోచలేదు. వెంటనే యటనుండి వెడలిపోయెను.

తరువాత మరల సముద్రమునకు పోలేదు.

* * *

...మధురస్మృతుల మైకములో తన యొంటరితనమును గూడ మఱచెను.... ఈ సంవత్సరపు జీవిత మాతని బూర్తిగ మార్పునైచెను. తా నభిలషించిన స్త్రీ వలచివచ్చినపుడు పిచ్చిభ్రమలుపడి బెదరిపోయిన మూర్తికిని యీతనికిని పోలికలేదు. ఈతడు స్త్రీ కుతూహలమును మిక్కిలి సులభముగ పసికట్టగలడు. చాకచక్యముతో యభీష్ట కామమును సాధించును. 'కాన్వకేషన్' అని తెలిసినవెంటనే కమల జ్ఞాపకమువచ్చెను. ఏవేవోకలలు! ఎన్నెన్నో భ్రమలు! ప్రయాణ సంసిద్ధుడయ్యెను. ఈమార్పునకు కారణము గలదు. ఏవూరియందైనను తన స్నేహము నాశించువారనేకులుండెడివారు. అట్టే యొకడు తటస్థించెను. వానితోను వాని భార్యతోడను యేవేవో కబురులు చెప్పుకొనుచు 'టీ' సేవించెడివారు. తాను మాటలాడునపుడు యువతి శ్రద్ధగ వినుచుండెడిది. వెకిలిగ వ్యంగముగ నవ్వుచుండెడిది...ఒకప్పుడామె కాలు తగిలెను. వస్తుతః నమాయకుడు, వెంటనే తన కాలు వెనుకకు లాగుకొనెను. ఆమె బిగ్గరగా చిలిపిగా నవ్వెను. ఆతనికి చెప్పరానంతభయము వైచెను, గుండె దడదడలాడెను. తన స్నేహితునిజూడ నాతనికిది తెలియునో తెలియదో నిర్ణయింపరాకుండెను...... తరువాత కాలు తగులుచునే యుండెడిది. ఒకనాడు చీకటిపడినపిదప యొంటులకో మూర్తి వారింటికి పోయెను. ఆయన 'సినిమా'కు వెళ్లిరని చెప్పెను. తిరిగివచ్చుచుండ 'పోతున్నారా' యని దీనముగ ననెను. ఆతడు వెనుకకు తిరిగిచూచెను. ఆ క్రీగంటి చూపులు, తొలికిరణముల వెలుగుతో మందహాసము తాండవించుచున్న చిరుపెదవులు, భీతితో, ఆసక్తితో, యానందముతో యదరుచుండిన డెందము ఆతని హృదయాంతరాళమున దాగియున్న బడబాగ్నినొక్క పెట్టున రెచ్చగొట్టి, రక్తము నుడికించి, యున్మత్తుని గావించెను......

మూర్తి వట్టిపిరికివాడు. ఆపిరికి తన మెందుబోయెను. పూర్వము కమల యాతనిపొంత గూర్చుండుటయే నసహ్యించుకొనెను. ఆ యసహ్యమేది? ఈ తారతమ్యమేమి? వీనికి సంబంధము గలదా?

కమలవద్దనుండి తానెందుకు వెడలిపోయెను? ఇంటికి పోయినపిదప తాను ప్రవర్తించిన విధానమంతయును సావధానముగ విమర్శించి యుండవచ్చును. హఠాత్తుగ సంభవించిన సంఘటనకు భీతినొంది తబ్బిబ్బైన నొక యనుభవశూన్యుని వెంగలితనమని భావించి యుండవచ్చును. జరిగినదానికి విచారించి యుండవచ్చును. అనగా యింకొకసారి యన్యథాప్రవర్తింపవలెనని తనలో తాను నిశ్చయించుకొనెనన్నమాట. ఇప్పుడు సాహసించెను. నిద్రాణమైయున్న ఆతని కోరిక ఫలించెను.

* * *

...రైలు వేగము తగ్గెను. ఎఱ్ఱనివి పచ్చనివి దీపము లగుపించుచుండెను. ఈ 'స్టేషన్'లో నైనను యెవ్వరైన వత్తురని యాశపడెను. కొంతసేపటికి రైలాగెను. చింపిరితల, ఎఱ్ఱకళ్లు, గుండీలు లేని చొక్కా, మాసిన ధోవతితో యెవ్వడో ప్రవేశించెను. మూర్తి కాతని నెక్కడో చూచినట్లనిపించెను. పలుకరించి తెలుసుకొననెంచి, 'ఎక్కడిదాకా నండీ?' యనెను. వెంటనే యాతడు చిరాకుగా చురచురా చూచుచు, మూటముల్లెలు సర్దుకొని వెడలిపోయెను. మూర్తి కొంచెము భయపడెను.

ఆతని ముఖ మచ్చుగుద్దినట్లు కమలదని, హఠాత్తుగ స్ఫురించెను. దిగి చూచెదమనుకొనుచుండగ నే రైలు బయలుదేరెను.

రైలుబండి యథాప్రకారము సాగిపోవుచుండెను. జరిగినదంతయును కలయేమో ననిపించెను. కిటికీనుండి వెనుకకు చూచెను. దూరమున నున్న 'స్టేషన్' లాంతరుతప్ప మరేమియు నగుపించుటలేదు. అప్పటికి చంద్రుడస్తమించెను. కారుచీకట్లలో నా సన్ననిదీప మాతనికేవో యసంపూర్ణ భావములు రేకెత్తించెను. ఇంతలో దీపము రెపరెపా కొట్టుకొనెను. మఱల ప్రకాశించెను. అసందర్భముగ నారిపోయెను —రైలు వంపుతిరిగెను.

సాయంకాలమే చేరవలసిన రైలు, ప్రొద్దుపోయిన పిదప కాని గమ్యస్థానము చేరలేదు. త్వరత్వరగ సామానంతయును విశ్రాంతి గదిలోనికి చేర్చి, మూర్తి, యత్యంతమైన ఆశతోను, ఉత్సాహముతోను బయల్వెడలెను. అది వెన్నెలరోజులు. కమల మేడపైనుండి వీధివంక చూచుచుండెను. దూరమునుండియే మూర్తిని గుర్తించెను. మత్తుగ కన్నులుమూసి తల వాల్చెను. లేవెన్నెల విరజిమ్ము చిరునవ్వులు వెదజల్లెను. ఆతడు పట్టరాని సంతోషముతోను, ఉద్రేకముతోను తబ్బిబ్బయ్యెను. రెండంగలలో కమల యెదుట వ్రాలెను.

కమలనుచూచి తన దృష్టిని తాను నమ్మలేకపోయెను. ఆమె ముఖము చాల కటువుగాను, తీక్ష్ణముగా నుండెను. పొఱపాటు జరిగినదేమోనని తడబడెను. ఇంతలో 'ఎవరు మీర'ని యామె సూటిగా ప్రశ్నించెను

నిజమే! తనెవరు? ఇంతమటుకు నాతని నట్లు ప్రశ్నించినవారు లేరు. తానెవరో తెలియదా? ఎట్లు మఱచిపోగలదు ఐనను తానెవ్వరైననేమి? దానితో నిమిత్తములేదుగదా. కాని సమాధానము చెప్పవలెను. జంకుచు 'నేనెవరో తెలియదా' యనెను.

ఆమె కలవరపడెను. తెలియకేమి. తెలియును. పాపము తన కర్మ కాతడెట్లు బాధ్యుడు. ఆతని బెదురుచూచి కరగిపోయెను. తన తొలి సన్నివేశములు జ్ఞప్తికివచ్చెను. తన చరిత్ర యంతయు కన్నుల యెదుట తాండవించెను. చెప్పరానికోపము పట్టరాని యావేశము, ఆపలేని దుఃఖము కలిగెను. 'మీరు పొరబడ్డారు. వెళ్ళిపొండి. వెళ్ళిపొండి' యని చకచకా లోనికిపోయెను. మూర్తి కంతయు నగమ్యగోచరముగ నుండెను. కాని యామెను వెంబడించెను.

వసారా పడకగది దాటి యామె సరాసరి నెరాబాలోనికి పోయెను. దీర్ఘముగ నేలవంక చూచుచు నిలుచుండెను. మూర్తి వసారా ప్రవేశించి నలుమూలల చూచెను. ప్రసిద్ధ చిత్రకారులు గీచిన బొమ్మలతో నలంకరింపబడియుండెను. ఆతని దృష్టిని తూర్పుననున్న నొక చిత్ర మాకర్షించెను. అది నట్టడివి. కారుచీకటి. వర్షము కురిసి వెలిసినట్లు ఆకు లన్నియును వాలియుండెను. ఒక చెట్టుక్రింద సమిథల చిరుమంటకు యిరువురు వ్యక్తులు చలికాచుకొనుచుండిరి. ఒక పిట్ట మంటలో మసిచాయగ నగుపించుచుండెను. ఇంకొకటి యందు దుముకుచుండెను... మైమఱచి కొంతతడవట్లే చూచుచు నిలుచుండెను... బల్లమీద నొక చిత్రపటముండెను. అందలి స్త్రీ కమల కావచ్చును. బాలుడు ఆమెను పోలియుండెను.

కొడుకో తమ్ముడో కావలెను. వాని పై నీటిచుక్క లుండెను!...

ప్రకృతికంతయు వెండిపూసినట్లు చంద్రుడు ప్రకాశించుచుండెను. చిరుగాలికి కమల ముంగురులు నాట్యమాడుచుండెను. మూర్తి దేహము పులకించెను. ఆమె బుజములపై చేతులు వేయుచూ 'ఎంత హాయిగా ఉన్న దీ వెన్నెల' యనెను. పురుష స్పర్శవలన కలుగు శారీరిక మనోవికారముల కలవాటుబడిన ప్రాణి! తృటిలో మైకము క్రమ్ముకువచ్చెను. వెఱ్ఱిగ యాత్రముగ నాతనివంక చూచెను.

మూర్తి యభీష్టము సిద్ధించెను.

ప్రయాణ బడలికచే యొడలెరుంగక నిద్రించెను. తెల్లవారుఝామున చల్లని వస్తువేదో తగిలినట్లై మేల్కొనెను. ఆతని ప్రక్క కమల నిద్రించుచుండెను. ఆమె వైఖరి యసాధారణముగ గన్పించెను. ఆమెను తాకెను. కొయ్యబారినట్లుండెను. కదల్పెను. కట్టెవలె కదిలెను. ఉలికిపడి దీపము వెలిగించెను. ఆమె తలవద్ద నొక కాగితముండెను. తాను శయనించినపుడది యుండలేదని గుర్తుకువచ్చెను. అనగా?—మూర్తి కంపించిపోయెను. ఛీ ఛీ! పాడు ఆలోచనలు, నిదురమత్తున వచ్చినవి కాబోలు. అమంగళము ప్రతిహతమగుగాక!...ఆ కాగితమునం దేమున్నదో జూడవలె ననిపించెను. అం దిట్లుండెను.

"నీకీ ఉత్తరం అందేప్పటికి నేనీ లోకంలో ఉండను. నువ్వన్న మాటలన్నీ అసత్యాలనుకొన్నా; నిజంగా నన్ను నేనే మోసపుచ్చుకొన్నా! ఇవ్వాళ్ళ బుజువైంది...కాని నేనీ వృత్తి నవలంబించింది మటుకు నీకొఱకే. అది పరమ సత్యం...భగవంతుడు నిన్ను నా కప్పగించి నాన్నను అమ్మను ఎత్తుకుపోయాడు. ఉన్న ఎకరంన్నరలో వచ్చే గింజలు మూడునెల్లకు చాలవాయె. ఏ ఉద్యోగానికైనా నాకు చదువూ సంధ్యా లేదాయె.. నీకోసమే చావును కూడా బలిచేశా, ఇక శరీర మొక లెక్కా!...నా త్యాగానికి నేనే మురిసిపోయినా. గర్వించా. అది అహంకారమో, మూర్ఖతో, ఆనందమో కాని కామేచ్ఛమటుకు కాదు. అదే శరీరాన్ని పరికరంగా చేసికొని నన్ను బానిసను చేసుకుంది. మూర్ఖురాల్ని మోసగించింది. సత్యాన్నసత్యంగా మార్చింది... శారీరక వాంఛకులొంగి నీకు కళంకంగా, నీ ఆశయాలకి విశ్వాసాలకి విరుద్ధంగా నేను బ్రతుకబోను .. నన్ను మఱచిపో బాబూ!...."

మూర్తికి మతిపోయినట్లయ్యెను. ఆమెను తాకుటకు కూడ భయపడెను. అంతలో యింకొక గంటకు తన యూరికి రైలుండెనని జ్ఞప్తికివచ్చెను. రెండడుగులు ముందుకువైచెను. చేత నా యుత్తరముండెను. దాని నేమిచేయుటకును తోచలేదు. తాను వచ్చునప్పటికి ప్రొద్దుపోయెను. తనకు తెలిసినవా రెవ్వరికిని తా నగుపించలేదు. తా నీ రైలుకు పోయినచో తన రాకపోక లెవ్వరికిని తెలియవు. కర్మముచాలక యెవ్వరైనను త న్ననుమానించినచో ఈ కాగితము తన రాకను నిరూపించును. ఆమె పుణ్యమాయని తన పేరు నుదహరింపలేదు. ఉత్తరమును తీసినచోటనే పదిలముగ నుంచి చరచర వెడలిపోయెను.

...నాటికి నేటికి, కమల ఆత్మహత్యకు తానెంతమటుకు బాధ్యుడో మూర్తికి బోధపడలేదు!